ప్రజాశక్తి
సోమవారం 29 ఏప్రిల్ 2024
8 పేజీలు

విశాఖపట్నం
అనకాపల్లి

ఏం సాధించారని ఓట్లు అడుగుతున్నారు ?

బహిరంగ సభలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు, చిత్రంలో షర్మిల, సత్యారెడ్డి, రామారావు

- వైసిపి, టిడిపిలకు పిసిసి అధ్యక్షురాలు షర్మిల సూటిప్రశ్న
- మోడీకి బాబు, జగన్ తొత్తులుగా మారారని విమర్శ
- ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించండి : సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు పిలుపు
- అక్కయ్యపాలెంలో ఉత్సాహంగా బహిరంగ సభ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, సీతమ్మధార విలేకరి

పదేళ్లలో రాష్ట్రంలో ఏం సాధించారని ప్రజలను ఓట్లు అడుగుతున్నారని టిడిపి, వైసిపి అధినేతలను పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల ప్రశ్నించారు. మోడీకి జగన్, బాబు తొత్తులుగా మారారని విమర్శించారు. ఎపి న్యాయ్ యాత్రలో భాగంగా ఆమె ఆదివారం అక్కయ్యపాలెంలోని మహారాణి పార్లర్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మద్యపాన నిషేధ హామీని తుంగలో తొక్కారన్నారు. గత ఎన్నికల్లో విశాఖలో ఎంపీగా గెలిచిన వ్యక్తి ఏనాడైనా పార్లమెంట్లో స్టీల్‌ప్లాంట్ గురించి మాట్లాడిన దాఖలాలు ఉన్నాయా ? అని ప్రశ్నించారు. రాష్ట్రానికి జగన్ హయాంలో రాజధాని లేకుండా పోయిందన్నారు. విశాఖను డ్రగ్స్ కేంద్రంగా మార్చిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఓటు అనేది ఆయుధంలాంటిదని, దానిని ప్రతి ఒక్కరు మంచికి ఉపయోగించి ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో టిడిపి, మిగతా 2లో..

సభకు హాజరైన ఇండియా బ్లాక్ పార్టీల కార్యకర్తలు

బీచ్ రోడ్డులో 5కె రన్‌లో పాల్గొన్న అధికారులు

ఉప్పొంగిన ఓటరు చైతన్యం

ఆర్‌కె బీచ్‌లో ఉత్సాహంగా 5కె రన్ వార్త సెంటర్ స్ప్రెడ్‌లో..

నేడు చోడవరంలో సిఎం సభ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సోమవారం చోడవరం రానున్నారు. విశాఖ విమానాశ్రయం నుంచి హెలీకాప్టర్‌లో ఉదయం 10.35 గంటలకు ఆయన చోడవరం చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో బహిరంగ సభ వద్దకు వెళ్తారు. ఉదయం 11 నుంచి 11.45 గంటల వరకు జరిగే సభలో ప్రసంగిస్తారు. తిరిగి హెలీకాప్టర్‌లో మధ్యాహ్నం 12.10 గంటలకు బయలుదేరి ఒంటి గంటకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అంబాజీపేట వెళ్లనున్నారు.

సిఎం.రమేష్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలి

వార్త 8లో..

రాష్ట్రానికి హోదా ఇవ్వని బిజెపికి మద్దతెందుకు ?

వార్త 3లో..

గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను పరిష్కరించండి

వార్త 2లో..

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎయు రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ప్రశాంతంగా ఎపి సెట్

79.97 శాతం హాజరు నమోదు వార్త మెయిన్‌లో..

ఎన్నికలకు పటిష్ట భద్రతా చర్యలు

కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లాలో ఎన్నికల నిర్వహణలో ప్రవర్తనా నియమావళి అమల్లో భాగంగా పటిష్ట చర్యలు చేపట్టామని, అధికారులకు, సిబ్బందికి దశల వారీగా అనుభవిజ్ఞులతో శిక్షణ అందజేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. రాష్ట్ర పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా ఆదివారం జిల్లాలో పర్యటించి స్థానిక పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వివిధ అంశాలపై చర్చించి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం తరపున చేపట్టిన చర్యలను వివరించారు. ఎన్నికల ప్రక్రియలో వివిధ దశల్లో భాగస్వామ్యం కానున్న అధికారులకు, సిబ్బందికి అనుభవిజ్ఞులతో శిక్షణ ఇప్పించామని పేర్కొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో మాస్టర్ లెవెల్ ట్రైనర్స్‌ను అందుబాటులో ఉంచామని తెలిపారు. 15 వేల మంది ఉద్యోగులను ఎన్నికల ప్రక్రియలో ఉపయోగిస్తున్నామని వెల్లడించారు. ఏడు విభాగాల కంట్రోల్ రూమ్‌లను జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశామని, వాటి ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి విభాగానికీ నోడల్ అధికారిని నియమించామని చెప్పారు. స్ట్రాంగ్ రూమ్స్, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల గురించి రాష్ట్ర పోలీస్ పరిశీలకులకు వివరించారు. 502 క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అక్కడ పటిష్ట చర్యలు చేపట్టామని అన్నారు. మైక్రో అబ్జర్వర్స్, వీడియో గ్రాఫర్స్‌ను అందుబాటులో ఉంచామన్నారు. అన్ని అంశాలను పర్యవేక్షించేందుకు ఏడు రకాల 110 బృందాలను నియమించామని తెలిపారు. ఏడు పోలీస్ చెక్ పోస్టుల ద్వారా తనిఖీలు చేస్తున్నామని వెల్లడించారు. వస్తు, ధన రూపేణా ఇప్పటి వరకు రూ.13.27 కోట్ల నగదును జప్తు చేశామని వివరించారు. సి.విజిల్ యాప్ ద్వారా 530 వినతులు స్వీకరించగా అందులో 395కి నిర్ణీత కాలంలో మిగతా 2లో..

మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మొదటి పేజీ తరువాయి..

సభలో మాట్లాడుతున్న సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు, చిత్రంలో షర్మిల

ఏం సాధించారని ఓట్లు అడుగుతున్నారు ?

వైసిపి ప్రభుత్వాలు రాష్ట్రానికి ఎటువంటి మేలూ చేయలేదన్నారు. ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్ వంటి అంశాలపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించాయన్నారు. ఫలితంగా యువత ఉద్యోగావకాశాలు కరువై వలసలు పోతున్నారని తెలిపారు. ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ విశాఖ ఎంపీ అభ్యర్థి సత్యారెడ్డి మాట్లాడుతూ ఇండియా బ్లాక్ గెలిస్తే స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోగలుగుతామన్నారు.

ఎంపీగా తనను గెలిపిస్తే విశాఖ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించాల్సిన అవసరముందన్నారు. బిజెపి పక్షాన చేరిన టిడిపి, జనసేనలను, వినాశకర వైసిపిని ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఐ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల మాట్లాడుతూ బిజెపి హయాంలో విపరీతంగా ధరలు పెరిగా యన్నారు. పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోగలమని చెప్పారు. కాంగ్రెస్ విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి లక్కరాజు రామారావు మాట్లాడుతూ విశాఖలో భూ కబ్జాలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సభలో కాంగ్రెస్ విశాఖ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాసరావు, దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి సంతోష్, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ఎ.వెంకట వర్మరాజు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్ట భద్రతా చర్యలు

పరిష్కారం చూపామని పేర్కొన్నారు. వివిధ మార్గాల ద్వారా రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి రెఫర్ చేసిన 56 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. వాలంటీర్లు, ఉద్యోగులు, రాజకీయ పార్టీల ప్రతినిధులపై వివిధ ఘటనల్లో కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

సభలో మాట్లాడుతున్న వైసిపి తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి

చేసిన మంచిని చెప్పేందుకే సిద్ధం సభలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జగన్ మోహనరెడ్డి గడిచిన ఐదేళ్లలో చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకే సిద్ధం సభలు నిర్వహిస్తున్నామని విశాఖ తూర్పు నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం 16వ వార్డులో తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సిద్ధం సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కరోనా సమయంలోనూ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించామన్నారు. మంచినీరు, విద్యుత్, శానిటేషన్ అంశాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ విశాఖపట్నాన్ని అభివృద్ధి చేసామన్నారు. వైసిపి ఎస్సీ సెల్ రీజనల్ కో.ఆర్డినేటర్ అల్లంపల్లి రాజబాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కందిమల్ల రాజశేఖర్, విశాఖ ఐటి విభాగం జాయింట్ సెక్రటరీ బోడ్డేడ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: ఎపిలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, దాని మిత్రపక్షాలను ఓడించి, ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు జె.రవి, టి.శ్రీరామమూర్తి, వై.నూకరాజు, చార్వాక పిలుపునిచ్చారు. కేంద్రంలో పదేళ్లపాటు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ పాలనలో మనువాద, హిందూత్వ ఫాసిస్టు, కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభించిందన్నారు. అయోధ్య రామాలయమే దేశానికి ఆదర్శంగా మార్చేశారన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగంలో సెక్యులర్, సోషలిస్ట్, రిపబ్లిక్ విధానాలు, .కుల, మత,ప్రాంత జాతి భేదం లేకుండా అందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు.

గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అదానీ గంగవరం పోర్టులోని కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని, స్టీల్‌ప్లాంట్‌కు వెంటనే కోల్ సరఫరా చర్యలు చేపట్టాలని గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) వర్కింగ్ ప్రెసిడెంట్ బి.జగన్, సంయుక్త కార్యదర్శి డి.రవికుమార్, ఉపాధ్యక్షులు కె.ఉపేంద్ర కోరారు. ఆదివారం జిల్లా కలెక్టర్‌కు ఈ మేరకు వారు వినతి పత్రం సమర్పించారు. అనంతరం జగన్ మీడియాతో మాట్లాడుతూ అదానీ గంగవరం పోర్టులో పనిచేస్తున్న జిపిఎల్, జిపిఎస్ కార్మికులందరి సమస్యలనూ వెంటనే పరిష్కారం చేసి విశాఖ స్టీల్‌ప్లాంటుకు బొగ్గు సరఫరా చేసే చర్యలు చేపట్టాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. వాటిని విధిగా అమలు చేయాలని కోరారు. పోర్టులో ఆపరేషన్స్, మెయింటెనెన్స్, ఎలక్ట్రికల్, రైల్వే ఇతర ముఖ్యమైన పనులన్నీ సుమారు 1500 మంది కార్మికులు చేస్తున్నారన్నారు. వీరి జీతాలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. వారి సమస్యలను పరిష్కరించటం న్యాయం, అత్యవసరమని తెలిపారు. ఆరు నెలల క్రితం పోర్టు నిర్వాసితులు, ఉద్యోగులు 64 రోజులపాటు ఆందోళన చేసారన్నారు. కలెక్టర్ సమక్షంలో అనేక సార్లు చర్చలు జరిగాయని, సమస్యలను పరిష్కరిస్తామని హామీలిచ్చారని గుర్తుచేశారు. అవేవీ అమలు కాలేదన్నారు. గడిచిన కాలంలో పోర్టులో పనిచేస్తున్న తొమ్మిది మంది కార్మికులు చనిపోయినా వారికి ఎటువంటి న్యాయమూ చేయలేదన్నారు. అంగీకరించిన మెడికల్ సదుపాయాలు కూడా అమలు చేయలేదని, వేతనాలు పెంచలేదని తెలిపారు. విధిలేని పరిస్థితుల్లో కార్మికులు తిరిగి ఆందోళనకు దిగారని అన్నారు.

హైకోర్టు ఆదేశాల ప్రకారం కార్మికులు, యూనియన్‌తో చర్చించాలని కోరారు. కార్మికుల మధ్య ఎలాంటి వివక్షతా చూపకూడదని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. వివక్షత చూపితే కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, ఉద్యోగాలు కూడా కోల్పోతారని, ఈ పరిణామాలు సమస్యను మరింత జటిలం చేస్తాయని స్పష్టం చేశారు.

ఒజిఎస్‌వి కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఒబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ విశాఖపట్నం (ఒజిఎస్‌వి) 2024-25 సంవత్సరానికిగాను కొత్త ఎగ్జిక్యూటివ్ కమిటీగా ఏర్పడి ఆదివారం నగరంలోని ప్రముఖ హోటల్‌లో బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా డాక్టర్ వైఎల్.నరసింగరావు తక్షణ మాజీ అధ్యక్షులు డాక్టర్ వి.సీతారామరాజు నుండి అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా సొసైటీ కార్యదర్శిగా డాక్టర్ కిరణ్మయి గొట్టాపు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్ ఆర్.శశిప్రభ, డాక్టర్ బిఎస్.కృష్ణమ్మ, డాక్టర్ టి.రాధ, డాక్టర్ టి.పద్మావతి హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఒజిఎస్‌వి ఆరాధ్య ఫెర్టిలిటీ సెంటర్‌తో కలిసి నిర్వహించిన పిసిఒఎస్‌పై సైంటిఫిక్ ప్రోగ్రామ్‌కు 120 మంది ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఒజిఎస్‌వి నూతన కార్యవర్గ సభ్యులు

200మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కరక చెట్టు పోలమాంబ జాతర సందర్భంగా పోలమాంబ సేవకులు మద్ది కుటుంబ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఒమ్ని ఆసుపత్రి, వి డెంటల్ ఆసుపత్రి, డాక్టర్. అగర్వాల్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో పెద్దవాల్తేరు ఫ్రెండ్స్ యూనియన్ క్లబ్ కల్యాణ మండపంలో నిర్వహించిన శిబిరంలో 200మందికి రక్తపోటు, మధుమేహం, ఇసిజి, దంత, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామ అధ్యక్షులు చిల్ల రామారావు రెడ్డి, గ్రామ కార్యదర్శి దల్లి అప్పలరెడ్డి పాల్గొన్నారు.

'నవరత్నాలు ప్లస్'అమలుకు కృషి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ఐదేళ్ల వైసిపి పాలనలో మేనిఫెస్టోలో పొందుపరిచిన నవరత్న పథకాలను 99శాతం అందించామని, మళ్లీ అధికారంలోకి వస్తే నవరత్నాలు ప్లస్ పథకాలను అమలు చేస్తామని వైసిపి జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. ఆదివారం ఉదయం లాసన్స్ బే కాలనీ ఎంపీ అభ్యర్థి ఝాన్సీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత జగన్‌దేనన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి మాట్లాడుతూ మేమంతా సిద్ధం యాత్రలో సిఎం జగన్‌పై చంద్రబాబు ప్రోద్బలంతోనే హత్యాయత్నం జరిగిందని, ఎన్నికల సంఘందీనిపై సుమోటోగా కేసు నమోదు చేయాలన్నారు. విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు.

రియల్ మీ నుంచి సరికొత్త 5జి స్మార్ట్ ఫోన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రియల్ మీ 65 మోడల్ 5జి కొత్త ఎడిషన్ ఛాంపియన్ స్మార్ట్ ఫోన్ ఆవిష్కరణ నగరంలోని ఓ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ నమ్మకమైన స్మార్ట్ ఫోన్ సేవలు అందిస్తున్నామన్నారు. తాజా ఫోన్ త్వరగా ఛార్జ్ అయ్యే ఫీచర్‌తో సరికొత్త కెమెరా టెక్నాలజీతో కూడి ఉందన్నారు. దీని ధర రూ.9999 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

విశాఖ దక్షిణం సర్వమతాల సమ్మేళనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని విశాఖ దక్షిణ నియోజకవర్గం సర్వమతాల సమ్మేళనం వంటిదని, అన్ని మతాలను గౌరవిస్తూ అందరూ అన్నదమ్ములు వలే ఇక్కడ జీవిస్తూ ఆదర్శంగా నిలిస్తున్నారని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. నగరంలోని ఈల్ షద్దాయి ప్రార్థన సెంటర్ పాస్టర్ కుమార్ ఆహ్వానం మేరకు గణేష్ కుమార్ ఆదివారం అక్కడి ప్రార్థనలకు హాజరయ్యారు. కార్యక్రమంలో 33వ వార్డు వైసిపి సీనియర్ నాయకులు బొడ్డేటి ప్రసాద్, వై.చిన్నమ్మలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా 33వ వార్డులో జనసేన పార్టీకి చెందిన యువకులు గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. వారందరికీ గణేష్ కుమార్ పార్టీ కండువాలు మెడలో వేసి ఆహ్వానించారు.

ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని తిప్పికొట్టాలని, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని జై భారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి.రమణ కోరారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు అంతా నడుం బిగించాలని, ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకున్నప్పుడే ఇది సాధ్యమని అన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల సంగ్రామమే అతి పెద్ద పండగ అని తెలిపారు. సమావేశంలో త్రిమూర్తులు, రావిప్రోలు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

1 నుంచి పిల్లలకు నట శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వేసవి సెలవులు సందర్భంగా థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్, నవరస ఆధ్వర్యంలో మే ఒకటి నుంచి పిల్లలకు 'యాక్టింగ్ వర్క్ షాప్'ను నిర్వహిస్తున్నట్లు నవరస కార్యదర్శి, దర్శకుడు పివి.రమణమూర్తి ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని టిఎస్ఆర్ కాంప్లెక్స్ మొదటి అంతస్తులో ఉన్న రంగ సాయి నాటక గ్రంథాలయంలో శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 9848461959, 8639507458 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

BEFORE THE HONOURABLE COURT OF VII ADDITIONL. FAMILY JUDGE AT CHENNAI
I.D.O.P.No. 2160 of 2023

Mr. A.Daniel Prathik Raj,
S/o. Mr. Raja Kumar
...Petitioner
Vs
Mrs. Golla Gnana Preethi,
D/o. Golla Abishekam.
W/o, Daniel Prathik Raj.A,
...Respondent

To,
Mrs.Golla Gnana Preethi,
D/o. Golla Abishekam.
W/o, Daniel Prathik Raj.A
F2, MaruthiApartment,
Sector Apartments.
Sector -11, MVP Colony,
Vishakapatnam,
Andhrapradesh: 530 017.
And Flat No :8073, MVV City
Madhurawada,Vishakapatnam,
Andhrapradesh: 530048

Take notice that I have filed the above petition for Divorce in I.D.O.P.No. 2160 of 2023 against you Under Sec 10(X) of Indian Divorce Act.

Hence you are here by instructed to appear before the Hon'ble VII Addl Family Court at Chennai on **24.05.2024** at **10.30 AM** in person without fail otherwise the matter could be decided in your absence.

A.Daniel Prathik Raj
Petitioner in Person
Chennai

BEFORE THE HONOURABLE COURT OF VII ADDITIONL. FAMILY JUDGE AT CHENNAI
I.A.No. 1 of 2023 in
I.D.O.P.No. 2160 of 2023

Mr. A.Daniel Prathik Raj,
S/o. Mr. Raja Kumar
...Petitioner/Petitioner
Vs
Mrs.Golla Gnana Preethi,
D/o. Golla Abishekam.
W/o, Daniel Prathik Raj.A,
...Respondent / Respondent

To,
Mrs.Golla Gnana Preethi,
D/o. Golla Abishekam.
W/o, Daniel Prathik Raj.A
F2, MaruthiApartment,
Sector Apartments.
Sector -11, MVP Colony,
Vishakapatnam,
Andhrapradesh: 530 017.
And Flat No :8073, MVV City
Madhurawada,Vishakapatnam,
Andhrapradesh: 530048

Take notice that I have filed I.A.No.1/2023 in I.D.O.P.No. 2160 of 2023 to receive Additional Documents in I.D.O.P between you and me under Indian Divorce Act.

Hence you are here by instructed to appear before the Hon'ble VII Addl Family Court at Chennai on **24.05.2024** at **10.30 AM** in person without fail otherwise the matter could be decided in your absence.

A.Daniel Prathik Raj
Petitioner in Person
Chennai

ఘనంగా బాపూజీ విద్యాలయం వార్షికోత్సవం

ప్రజాశక్తి -గాజువాక : దిబ్బపాలెంలో బాపూజీ విద్యాలయం స్థాపించి 30సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం వార్షికోత్సవాన్న ఘనంగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర పాఠశాలల విద్యా ప్రాంతీయ సంచాలకులు (ఆర్‌జెడి) బి.విజయభాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలో ఉపాధ్యాయులు పిల్లలను ప్రేమగా చూస్తూ, ఎవరిని కించపరచకుండా, ప్రోత్సహిస్తూ చదువులు చెప్పాలని సూచించారు. పిల్లలకు ఇల్లే ప్రథమ పాఠశాల అని, తల్లిదండ్రులే ప్రథమ గురువులని, పిల్లల పట్ల అత్యంత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. మండల విద్యాశాఖాధికారులు రమణాజీ, విశ్వనాథం సమక్షంలో యుకెజి చిన్నారులకు స్నాతకోత్సవం నిర్వహించారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్స్ వెంకటనాయుడు, సత్యనారాయణ, ప్రిన్సిపల్ శోభారాణి, జిప్సా అధ్యక్షుడు పి.భాస్కరరావు, కార్యదర్శి బి.శ్రీనివాస్, రాము, వాసుదేవరావు, డి.శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల కరస్పాండెంటులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థినితోపాటు తల్లిదండ్రులను సత్కరిస్తున్న పాఠశాల ప్రతినిధులు

అనారోగ్యంతో ఆర్మీ జవాను మృతి

ప్రజాశక్తి- గాజువాక : దల్లివానిపాలేనికి చెందిన ఇండియన్ ఆర్మీ సోల్జర్ పాల అప్పలరెడ్డి (33) అనారోగ్యంతో ఆదివారం కల్యాణి ఆసుపత్రిలో మృతిచెందారు. అప్పలరెడ్డి కొంత కాలంగా కాశ్మీర్ సరిహద్దులో విధులు నిర్వహిస్తున్నాడు. అక్కడ అనారోగ్యానికి గురి కావడంతో ఈ నెల 21న అక్కడి నుంచి పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న కల్యాణి ఆసుపత్రికి చికిత్స నిమిత్తం పంపించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు మృతుని బందువులు తెలిపారు.

96వ వార్డులో 'గుంటూరు' ప్రచారం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి పెందుర్తి కూడలి నుంచి వెలంపేట వరకు పెందుర్తి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి గుంటూరు వెంకట నరసింహామూర్తి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రభుత్వ వల్ల ప్రజలపై భారాలు పడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అన్ని పన్నులూ పెరిగి ప్రజలు బతకడమే ఇబ్బందిగా ఉందని ప్రచారంలో ప్రజలు తన దృష్టికి తీసుకొస్తున్నట్లు వివరించారు. స్థానికుడునైన తనకు ఈ ప్రాంతంలోని సమస్యలు తెలుసని, అసెంబ్లీకి పంపిస్తే వాటిని ప్రస్తావిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నరసింహామూర్తి సతీమణి భారతి, జివివి.కుమార్, రవి, మనోహర్, అవినాష్, సాయిప్రియ పూజిత, ముఖేష్, వరలక్ష్మి పాల్గొన్నారు

పెందుర్తిలో ప్రచారం చేస్తున్న గుంటూరు వెంకట నరసింహామూర్తి

నేటి నుంచి విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి -పిఎం పాలెం : పిఎం.పాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ - వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 29, 30 తేదీల్లో వికలాంగుల అంతర్ జిల్లాల జోనల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఏసీఏ విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్ నిర్వహణ కోసం క్రీడాకారులకు అవసరమైన భోజనంతో పాటు వసతి తదితర వాటిని కల్పించినందుకు ఏసీఏ అధ్యక్షులు పి.శరత్‌చంద్రారెడ్డి, కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్ రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వికలాంగ క్రికెట్ క్రీడాకారుల అభివృద్ధికి ఏసీఏ ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు.

నేటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : నియోజకవర్గ పరిధిలో ఉన్న ఓటర్లకు ఈ నెల 29వ తేదీ నుంచి ఓటరు స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.భాస్కరరెడ్డి ఆదివారం తెలిపారు. 348 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న ఓటర్లందరికీ సంబంధిత బిఎల్ఒల ద్వారా ఓటరు స్లిప్పులు ఓటర్లకు నేరుగా అందజేస్తామని తెలిపారు.

గణబాబుకు క్రైస్తవ సంఘాల మద్దతు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92 వార్డు పరిధి లక్ష్మీనగర్‌లోని స్టీఫెన్ పాల్ చర్చి, 90వ వార్డు పరిధి ఎన్ఎడి కొత్త రోడ్డు జంక్షన్‌లోని యునైటెడ్ క్రైస్ట్ చర్చిలను తెలుగుదేశం కూటమి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబు విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సందర్శించారు. వీరిని క్రైస్తవ మత పెద్దలు ఆశీర్వదించి తమ మద్దతును తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ పెద్దలు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

చిత్రాలు గీసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి-కరాస : హిందూ కోడ్ బిల్, మహాద్ చెరువు పోరాటం మీద కళ్లకు కట్టినట్టు చిత్రాలు గీసిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. నేవల్ డాక్ యార్డ్ ఉద్యోగి బుడుమూరు జగదీష్, రామగౌరి దంపతుల కుమార్తె వైనవి(14), కుమారుడు చైతన్య(10) అంబేద్కర్ జయంతి సందర్భంగా చిత్రాలను గీశారు. 104 మర్రిపాలెం ప్రాంతం కేంద్ర విశ్వవిద్యాలయంలో 9, 7 తరగతులు చదువుతున్న ఆ విద్యార్థులకు తెలుగు ప్రపంచ చిత్రకారుల సమాఖ్య వారు విజయవాడలో నేషనల్ చిల్డ్రన్ ఆర్ట్ కాంపిటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్, మెమోంటో, నగదు అందజేశారు. ఈ మేరకు వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

రాష్ట్రానికి హోదా ఇవ్వని బిజెపికి మద్దతెందుకు ?

ప్రజాశక్తి-సీతమ్మధార : విభజన హామీలు అమలు చేయని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని బిజెపికి ఏ విధంగా మద్దతు పలుకుతున్నారని జై భారత్ జాతీయ పార్టీ అధ్యక్షులు, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వివి.లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబ పాలన నచ్చదు అన్న బిజెపి రాష్ట్రంలో రెండు కుటుంబాల పార్టీలతో ఏ విధంగా పొత్తు పెట్టుకుందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్లలో చేసిన రాష్ట్ర అప్పులపై శ్వేత పత్రం విడుదలచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆస్తుల వివరాలు, ఏయే పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఎంత అప్పులు చేశాయో ప్రకటించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో వైసిపి, జనసేన, టిడిపి స్పష్టత ప్రకటించాలన్నారు. తమ పార్టీ గెలిస్తే నష్టపోయిన రైతులకు ప్రాధాన్యత, కూలీల ఖర్చుల కోసం నెలకు రూ.5వేలు అందిస్తామని, ఒక్కొక్క నియోజకవర్గానికి ఏడాదికి రూ.100 కోట్లు నిధులు, ఒక్కొక్క గ్రామ పంచాయతీకి ఏడాదికి రూ.కోటి నిధులు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

500 మంది చేరిక

ఉత్తర నియోజకవర్గంలోని 17 వార్డుల నుంచి సుమారు 500 మంది యువత జై భారత్ నేషనల్ పార్టీలో చేరడం చాలా సంతోషకరంగా ఉందని వివి.లక్ష్మీనారాయణ అన్నారు సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం యువతను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

వైసిపికి ఎస్‌సి సెల్ మద్దతు

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌సి సెల్ నాయకులు

ప్రజాశక్తి-ఆరిలోవ : వైసిపికి తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తూర్పు నియోజకవర్గ ఎస్‌సి సెల్ నాయకులు తెలిపారు. ఆరిలోవలో వైసిపి ఎస్‌సి సెల్ విభాగం, ఇతర ఎస్‌సి సంఘాల నాయకులు ఆదివారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసిపి పాలనలో ఎస్‌సి సామాజిక వర్గం అన్ని విధాలా పురోభివృద్ధి సాధించిందని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా సమస్థాయికి జగన్మోహన్‌రెడ్డి తీసుకెళ్లారన్నారు. టిడిపి పాలనలో ఎస్‌సిలు అన్ని విధాలా నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎంవివి.సత్యనారాయణ, ఎంపీగా బొత్స ఝాన్సీ విజయం సాధించడం ఖాయమన్నారు. వారికి ఎస్‌సిల మద్దతు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర వైసిపి ఎస్‌సి సెల్ కో-ఆర్డినేటర్ అల్లంపల్లి రాజబాబు, జిల్లా అధ్యక్షులు బోని శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పిల్లి వీర్రాజు, తూర్పు నియోజకవర్గం అధ్యక్షులు గూడపాటి విక్టర్, నాయకులు కాకర గోవిందు, వంకర బాబూరావు, డేవిడ్, మువ్వల శ్రీను, అర్జున్ శ్రీధర్, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎయు హైస్కూల్లో 1988వ సంవత్సరం పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ముడసర్లోవ పార్కులో సమావేశమయ్యారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి రోజంతా సరదాగా గడిపారు. అందరూ తమ కుటుంబ సభ్యులను పరిచయాలు చేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. చదుకునే రోజులను గుర్తుచేసుకొని రోజంతా అందరూ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో వై.శ్రీనివాసరావు, ఎంవి.గంగాధరం, ఎవిఆర్.రామకృష్ణ, పి.చంద్రశేఖర్‌రావు, ఎ.జోగారావు, కె.నరసింగరావు, సిహెచ్.ప్రసాద్ పాల్గొన్నారు.

భవిష్యత్తు ఆలోచించి ఓటు వెయ్యండి : గంటా

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : రాష్ట్ర భవిష్యత్తును ఆలోచించి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని గంటా శ్రీనివాసరావు కోరారు. ఆనందపురం మండలం కుసులవాడ, గిడిజాల, దబ్బంద, తర్లువాడ, పందలపాక, చందక, గొట్టిపల్లి పంచాయతీల్లో ఆదివారం గంటా శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుసలవాడలో పలు సమస్యలను స్థానికులు గంటా దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో అత్యధిక మెజార్టీ వస్తే గ్రామాన్ని దత్తత తీసుకొని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని గంటా హామీ ఇచ్చారు. రేగానిగూడెం, ఇచ్చాపురం గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి కూడా హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల ప్రచారంలో ఘట్టంనేని సుభాష్ చంద్రబోస్, సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి, శివాజీ, విఆర్‌కె.రాజు, గిడిజాల మాజీ సర్పంచ్ కోరాడ రాము, వైకుంఠ, షిణగం రామకృష్ణ, మచ్చ శ్రీను, మచ్చ రామనాయుడు, కోరాడ వేణు, కోరాడ అప్పలరమణ, ఎడ్ల సాంబశివరావు, మీసాల అప్పలరాజు పాల్గొన్నారు.

దళితవాడల్లో టిడిపి ప్రచారం

భీమునిపట్నం : టిడిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావును, విశాఖ లోక్‌సభ అభ్యర్థి ఎం.శ్రీభరత్‌ను గెలిపించాలని కోరుతూ టిడిపి ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పతివాడ రాంబాబు ఆధ్వర్యాన మండలంలోని తాటితూరు, తాళ్లవలస, జివిఎంసి నాలుగో వార్డు పరిధిలోని జెవి.అగ్రహారం, నిడిగట్టు, కాపులుప్పాడ గ్రామాల్లోని దళితవాడల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వంలో దళితులకు అన్ని విధాలా అన్యాయం జరిగిందని రాంబాబు విమర్శించారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంపి ఐదవ వార్డు పరిధి 75, 77 సచివాలయల గృహ సారథులు అలుగోజు రాజు, డి సుశీలతో పాటు శారదనగర్, పరదేశిపాలెం, సాయిరాం కాలనీ, రాజీవ్‌గృహకల్ప తదితర ప్రాంతాల వైసిపి నాయకులు శెట్టి ప్రవీణ్, వెంకటరమణ, శ్రీను, నాగభూషణ్, అనీల్, రాంబాబు, ధనుంజయ, రాజేష్, సతీష్ తదితరులు కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యాన వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వారందరికీ మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పార్టీ కండువాలు వేసి టిడిపిలోకి ఆహ్వానించారు.

రక్షణ గోడ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రిజిస్ట్రార్

రక్షణ గోడ నిర్మాణం పరిశీలన

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వ విద్యాలయం క్రీడా మైదానం వెనుక భాగంలో హాస్టల్ భవనం చుట్టూ నిర్మిస్తున్న రక్షణ గోడ పనుల ప్రగతిని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ స్వయంగా పరిశీలించారు. పనుల ప్రగతి గురించి ఇంజినీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గోడ నిర్మాణం పటిష్టంగా జరపాలని సిబ్బందికి ఆదేశించారు. రాతిని ఉపయోగించి భవనానికి రక్షణగా చుట్టూ గోడను నిర్మాణం చేస్తున్నట్లు ఇంజినీరింగ్ సిబ్బంది వివరించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
సోమవారం
29 ఏప్రిల్ 2024

కలం మాట

తెలుసు నీకు.. తెలుసు నాకు.!

తెలుసు నీకు! తెలుసు నాకు ! అందరికీ తెలుసా ?
భారత రమ్య క్షేత్రంలో రాజ్యాంగం
సౌమ్యంగా ఉద్భవించిన ఒక వట వృక్షం.
హరిత పత్రాలను రాల్చకండి కొందరు
సున్నిత కొమ్మలను కూల్చదండి ఇంకొందరు
తెలుసు నీకు! తెలుసు నాకు ! అందరికీ తెలుసా ?
వటవృక్షం ప్రాణవాయువునిస్తుంది.
తెలుసు నీకు! తెలుసు నాకు ! అందరికీ తెలుసా ?
నోటు కోసం ఓటు హక్కును
ఏ ఒక్కరూ అమ్ముకోరాదని
అందరూ తెలుసుకోండి!
అంగాంగాల త్రిలింగం!
అందరికీ అభయమిచ్చే అంతరంగం
మహోన్నత రాజ్యాంగం మనదే కదా!

తెలుసు నీకు !
తెలుసు నాకు !
మిత్రమా ! మిత్రోత్తమ!
జన్మనిచ్చిన అమ్మ కన్నా..
పవిత్రమైన ఓటు హక్కు మిన్న!
తెలుసు నీకు! తెలుసు నాకు ! అందరికీ తెలుసా ?
పదవుల కన్నా ! పార్టీలకన్నా !
ఆస్తుల కన్నా - అంతస్తుల కన్నా.
మహోన్నత రాజ్యాంగమే మిన్న!
తెలుసు నీకు! తెలుసు నాకు ! అందరికీ తెలుసా ?
పంచ వర్ష ప్రణాళికలో
ప్రభవించిన ఎన్నికల పల్లకిలో
స్వార్ధం స్వారీ చేస్తుందని
క్షుద్ర రాజకీయం తాండవిస్తుందని
తెలుసు నీకు! తెలుసు నాకు ! అందరికీ తెలుసా ?
కాసులతో ఎరవేసే పాలకులు వారని
ఆ కాసులకు ఎదురుచూసే పాలితులువీరని

- ఎం. ఆనంద్‌శర్మ
అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ ఇంగ్లీష్,
ఇఎసిఎస్ ల్యాబ్
పూర్వ ప్రిన్సిపల్, బిఆర్‌బిఎం పీజీ కాలేజీ,
కంచరపాలెం, సెల్ : 63029 02766



పశ్చిమంలో సిపిఐ విస్తృత ప్రచారం

- హారతులిచ్చి అపూర్వ స్వాగతం పలికిన ప్రజలు

మర్రిపాలెంలో విమలకు హారతులిస్తున్న మహిళలు

ప్రజాశక్తి -గోపాలపట్నం :విశాఖ పశ్చిమ నియోజకవర్గం మర్రిపాలెం రాంనగర్, శ్యాంనగర్ తదితర ప్రాంతాల్లో ఇండియా ఫోరం బలపరిచిన సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల ఆదివారం సాయంత్రం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. స్థానికులు హారతులిచ్చి, బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను ఆడిగితెలుసుకున్నారు. ఎన్నికల్లో నవరత్నాలు అంటూ వైసిపి ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, ఇపుడు నవరత్నాలు ప్లస్ అంటూ మభ్యపెడుతోందని దుయ్యబట్టారు. మద్యనిషేధం అటకెక్కించారని, ఇతర హామీలను తుంగలో తొక్కారని, చివరకు రాజధాని లేని అనాథ రాష్ట్రంగా ఎపిని మార్చేశారని మండిపడ్డారు. హామీలు నెరవేర్చని వైసిపిని, ప్రతిపక్షంగా దాన్ని ప్రశ్నించలేని టిడిపి, జనసేనలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఇండియాఫోరం విజయం సాధిస్తే, ఎపికి ప్రత్యేకహోదాతోపాటు అన్ని సమస్యలు పరిష్కారమౌతాయన్నారు. ప్రచారంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు రాజు, శ్రీనివాస్, అప్పారావు, కిరణ్ కుమార్, సరస్వతి, తులసిరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, పి చంద్రశేఖర్, క్షేత్రపాల్, ఆదినారాయణ, ఎఐఎస్ఎఫ్ నాయకులు నాగభూషణం, భాను, వంశీ, జ్యోతి, దుర్గ, మహిళా నాయకులు బేగం, పుష్ప, సిపిఐ. డిహెచ్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

సార్వత్రిక సంగ్రామం

పోటాపోటీగా రాజకీయ బేరసారాలు!

- అంగ, అర్థబలాలే అర్హతలుగా అభ్యర్థుల ఎంపిక
- అవకాశవాద రాజకీయాలు చేస్తున్న వైసిపి, టిడిపి
- ప్రజాసమస్యలను గాలికొదిలేసి పరస్పర ఆరోపణలు
- బిజెపికి అంటకాగుతూ ప్రశ్నించలేని దుస్థితి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు ఘట్టం ఈనెల 25తో ముగియడంతో, బలాబలాల అంచనాల్లో విశాఖలో రాజకీయ పార్టీలు నిమగ్నమయ్యాయి. ఎక్కడెక్కడ ఎవరెవరి ఓట్లు సాధించడానికి అవకాశాలు ఉన్నాయో 'బూత్‌ల వారీ పరిశీలన'కు పార్టీలు రంగం సిద్ధం చేసుకుంటూ కదులుతున్నాయి. విశాఖ పార్లమెంట్ మొదలు, అసెంబ్లీ స్థానాల వరకూ పలుచోట్ల త్రిముఖ, బహుముఖ పోటీ నెలకొంది. విశాఖ పార్లమెంట్‌లో వైసిపి, టిడిపి అభ్యర్థులైన బొత్స ఝాన్సీలక్ష్మి, శ్రీభరత్ అలాగే ఇండియా ఫోరం తరపున కాంగ్రెస్ తరపున సినీ దర్శక నిర్మాత సత్యారెడ్డి ప్రధానంగా పోటీ బరిలో ఉన్నారు. గాజువాకలో వైసిపి, టిడిపి అభ్యర్థులతోపాటు ఇండియా ఫోరం తరపున సిపిఎం అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, అలాగే పశ్చిమంలోనూ సిపిఐ అభ్యర్థి విమల పోటీలో ఉన్నారు. ఉత్తరంలో వైసిపితోపాటు కూటమి తరపున పోటీలో ఉన్న బిజెపి అభ్యర్థులేకాకుండా జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, సిబిఐ మాజీ జెడి వివి లక్ష్మీనారాయణ పోటీలో ఉన్నారు. అలాగే దక్షిణంలోనూ వైసిపితోపాటు కూటమి తరపున జనసేన అభ్యర్థి, ఇండియా ఫోరం తరపున కాంగ్రెస్ అభ్యర్థి వాసుపల్లి సంతోష్‌కుమార్ పోటీలో ఉన్నారు. ఇలా జిల్లాలోని అన్ని సెగ్మెంట్లలోనూ ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రత్యర్థులుగా ఇండియా ఫోరం అభ్యర్థులు, ఇండిపెండెంట్‌లు పోటీలో ఉన్నారు.

> 'కూటి కోసం కోటి పాట్లు సామెత తెలిసిందే. ఇది కూలీలు, శ్రామికులకు వర్తించేది. రాజకీయాలకూ వర్తించే సామెతలు అనేకానేకం ఉన్నాయి. ఓటు కోసం రాజకీయ పార్టీలు 'కోటి'పాట్లు పడుతున్న దృశ్యాలు కళ్లకు, 'రింగు' మంటూ చెవులకూ ప్రచారం ఊదరగొట్టడాలు తెలిసిందే. థామస్ కార్లెయిర్ అనే సామాజికవేత్త మాటల్లో చెప్పాలంటే 'రాజకీయాలతో ప్రజలను సంతోష పెట్టాలనుకోవడం దురాశే' అన్న మాట ప్రస్తుత ఎన్నికల ప్రచార వాతావరణంలో కళ్లెదుటే కనిపిస్తోంది.

సమస్యల ప్రస్తావన సున్నా...

తాజా ఎన్నికల్లో జిల్లాలో భిన్నమైన పరిస్థితులున్నాయి. అధికార వైసిపితోపాటు టిడిపి, జనసేన, బిజెపి కూటమి పార్టీల నేతలు, అభ్యర్థులంతా ప్రజాసమస్యలను ప్రస్తావించిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. విశాఖ పార్లమెంట్‌తోపాటు జిల్లాలోని ఏడు అసెంబ్లీస్థానాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. జిల్లాలోని ప్రధాన సమస్యలైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలన్న ప్రజాడిమాండ్‌ను గానీ, విభజన హామీలైన రైల్వేజోన్ ఏర్పాటు, ఇతర అంశాలపై ప్రధాన పార్టీల నేతలు మాటల యుద్ధానికే పరిమితమౌతూ ప్రజలను మభ్య పెడతున్నారు. వీరిలోవీరు పరస్పర ఆరోపణలను చేసుకుంటూ వారిలోవారికి స్పష్టత లేకపోవడంతోపాటు ఈ వ్యవహారమంతటికీ మూలకారకులైన కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని గానీ, ప్రధాని మోడీ బాధ్యతారాహిత్యాన్నిగానీ ఎవరూ ప్రశ్నించకుండా ప్రజలను గందరగోళపరుస్తున్న తంతు ఏళ్లతరబడి కొనసాగుతోంది. అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా స్థానికంగా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో 'బేరసారాల'తోనే రాజకీయాలను నడుపుతున్న వైఖరి ఆయా పార్టీల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

అభ్యర్థుల అంగ, అర్థబలాలే అర్హతలు

ఈ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రజాబలంతోపాటు అంగ, అర్థ బలాలు మరింత కీలకపాత్రను పోషిస్తున్నాయి. గడచిన ఎన్నికల్లో విశాఖ నగరంలోని నాలుగు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకున్న తెలుగుదేశం పార్టీ, ప్రస్తుత ఎన్నికల్లో రెండు స్థానాలను పొత్తుపార్టీలకు అప్పజెప్పింది. ఈ నేపథ్యంలో మారుతున్న తాజా సమీకరణాలు కీలకంగామారనున్నాయి. విశాఖ సిటీలోనితూర్పు, పశ్చిమం, దక్షిణం, ఉత్తరం అసెంబ్లీ స్థానాల్లో అంగ,అర్థబలంలో బలమైన అభ్యర్థులే ప్రధానపార్టీల నుంచి బరిలో ఉన్నారు. అన్నిస్థానాల్లోనూ వైసిపి అభ్యర్థులు పోటీలో ఉండగా, దక్షిణంలో కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బిజెపి బలపర్చిన వంశీకృష్ణ (జనసేన), ఉత్తరంలో విష్ణుకుమార్‌రాజు (బిజెపి) పోటీపడుతున్నారు.

గత ఎన్నికల్లో నగరంలోని నాలుగు అసెంబ్లీ స్థానాలూ కైవసం చేసుకున్న తెలుగుదేశం పార్టీ, దాని కూటమి అభ్యర్థులకు ఈ దఫా కత్తిమీద సాము తప్పేలా లేదు. అర్థ బలం, అంగబలం ఉన్న వారిని వైసిపి అధినేత జగన్ ఆయాస్థానాల్లో రంగంలోకి దించారు. భీమిలి అసెంబ్లీ సెగ్మెంట్‌లో టిడిపి అభ్యర్థిగా లేట్‌గా ఎంట్రీ ఇచ్చిన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు వైసిపి అభ్యర్థి మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు వెనక ఉన్న జనాన్ని హోల్‌సేల్‌గా కొనుగోలు చేసే వ్యూహం రచించడం కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది.

ఉప్పొంగిన ఓటరు చైతన్యం

- ఆర్‌కె బీచ్‌లో ఉత్సాహంగా 5కె రన్
- భాగస్వామ్యమైన యువత, అధికారులు
- ఆటపాటలతో ఉత్తేజం నింపిన కళాకారులు
- బంగారు భవిష్యత్‌కు ఓటేయాలని కలెక్టర్ పిలుపు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఎన్నికల పండుగలో భాగస్వాములై బంగారు భవిష్యత్తు కోసం ఓటేయాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ అమిత్‌శర్మ, జిల్లా కలెక్టర్ డాక్టర్ఎ.మల్లికార్జున పిలుపునచ్చారు. ఓటేసేందుకు ఉత్సుకత ప్రదర్శించాలని, శతశాతం ఓటింగే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కదలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఆర్‌కె బీచ్ రోడ్డులో 5కె రన్ ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా లెట్స్ ఓట్ ఫర్ డెమొక్రసీ, లెట్స్ ఓట్ ఫర్ ఫ్యూచర్ అంటూ ఓటర్లతో నినాదాలు చేయించారు. సంబంధిత పోస్టర్లు, బ్రోచర్లను ఆవిష్కరించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటేద్దాం : కలెక్టర్

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటుకు మించిన ఆయుధం లేదని, అందరూ దాన్ని సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. జిల్లాలో 1991 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చేపట్టామని, ఇక ప్రజలు వచ్చి ఓటేయడమే తరువాయి అని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో 66శాతం పోలింగ్ నమోదైందని, ప్రస్తుత ఎన్నికల్లో శతశాతం లక్ష్యంగా అందరూ భాగస్వాములు కావాలన్నారు.

లెట్స్ ఓట్ ఫర్ డెమొక్రసీ : అమిత్‌శర్మ

ఎన్నికల జనరల్ అబ్జర్వర్ అమిత్ శర్మ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఉత్సాహంగా పని చేస్తోందని, ఓటర్లు కూడా అదేస్థాయిలో స్పందించి ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. బంగారు భవిష్యత్తు కోసం ప్రతిఒక్కరూ ఆత్మవిశ్వాసంతో ఓటేయ్యాలని హితవు పలికారు. మెరుగైన పోలింగ్‌శాతంతో ఎన్నికల క్రతువు ప్రశాంతంగా ముగుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లెట్స్ ఓట్ ఫర్ డెమొక్రసీ అని వేలు చూపుతూ ఓటర్లలో ఉత్సాహం నింపారు.

ఉత్సాహంగా సాగిన 5కె రన్.

స్వీప్ కార్యక్రమంలో భాగంగా బీచ్‌రోడ్డులో చేపట్టిన 5కె రన్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. అధికారులు,యువ ఓటర్లు టీ షర్టులు, టోపీలు ధరించి విశ్వప్రియ పంక్షన్ హాల్ నుంచి పాం బీచ్ వరకు,

5కె రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, అబ్జర్వర్ అమిత్‌శర్మ

తిరిగి అదే మార్గంలో విశ్వప్రియ పంక్షన్ హాల్ వరకు ర్యాలీ సాగి ముగిసింది.కార్యక్రమంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు రెంగ రాజన్, సౌమ్య పాండే జైన్, పోలీసు జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, ఎడిసి కెఎస్. విశ్వనాథన్, స్వీప్ నోడల్ అధికారి రామారావు, పలు స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు చైతన్యానికి కళాకారులు, యువ ఓటర్లు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో స్ఫూర్తి నింపారు. వికలాంగ ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సుందరపు విజయానికి వంగవీటి పిలుపు



వంగవీటి రాధను అభినందిస్తున్న విజయకుమార్, నాగేశ్వరరావు, తదితరులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : తాజా ఎన్నికల్లో ఎలమంచిలి నియోజకవర్గంలో కూటమి బలపరిచిన జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌ను గాజుగ్లాసు గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని వంగవీటి మోహనరంగా తనయుడు వంగవీటి రాధ పిలుపునిచ్చారు. ఆదివారం అచ్చుతాపురం జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి విచ్చేసిన వంగవీటి రాధాకు స్థానిక మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు.

ఈ సందర్భంగా వంగవీటి రాధ మాట్లాడుతూ సిఎం జగన్‌రెడ్డి నేతృత్వంలోని వైసిపి పాలనలో రాష్ట్రాభివృద్ధి పూర్తిగా కుంటుబడిందన్నారు. పాలనలో పూర్తిగా విఫలమైన జగన్‌తోపాటు ఆ పార్టీలు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు రానున్న ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో ఓటమి పాలవ్వడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన అధ్యక్షులు బి రాందాస్, టెక్కలి పరశురాము, నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన జనసేన తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, మహిళలుపాల్గొన్నారు.

ఉక్కునగరంలో సిపిఎం బైక్ ర్యాలీ

బైక్‌ర్యాలీలో పాల్గొన్న సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు, కార్పొరేటర్ గంగారావు, తదితరులు

ప్రజాశక్తి- ఉక్కునగరం : సిపిఎం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉక్కునగరంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉక్కునగరంలో సిఐటియు కార్యాలయం వద్ద ర్యాలీని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ప్రారంభించారు. అనంతరం ప్రారంభమైన బైక్ ర్యాలీ అన్ని సెక్టర్లలో సాగింది. ఇండియా ఫోరం బలపరిచిన గాజువాక సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మరడాన జగ్గునాయుడు ర్యాలీలో పాల్గొని విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సిపిఎం చేస్తున్న పోరాటాన్ని వివరించేందుకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు బైక్ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యను పరిష్కరించగలిగేది సిపిఎం మాత్రమేనన్నారు. గాజువాకలో దశాబ్దాలుగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు సిపిఎం అభ్యర్థి కృషిచేస్తారని తెలిపారు. ఆయనను అసెంబ్లీకి పంపించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎన్.రామారావు, జె.అయోధ్యరాం, పి.శ్రీనివాసరాజు, టి.చిరంజీవి, మొహద్దిన్, తాంత్ర కనకరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

షీలానగర్‌లో...

గాజువాక: జివిఎంసి 69వ వార్డు పరిధి షీలానగర్‌లో హయ్యర్ మెమోరియల్ లూథరన్ చర్చి దగ్గర సిపిఎం నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి మరడాన జగ్గునాయుడును, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సత్యారెడ్డిని గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వై.సత్యవతి, జి.మణి, ఎస్.జ్యోతిశ్వరరావు పాల్గొన్నారు.

తోకాడలో వార్వా, నివాస్ ఆధ్వర్యాన...

గాజువాక : ఇండియా ఫోరం బలపర్చిన గాజువాక నియోజవర్గ సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు గెలుపు కోరుతూ వార్వా, నివాస్ ఆధ్వర్యాన తోకాడలోని సమైక్య అపార్ట్‌మెంట్‌లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అపార్ట్‌మెంట్ వాసులను కలుస్తూ, కరపత్రాలు పంపిణీ చేస్తూ సిపిఎం అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్వా, నివాస్ నాయకులు పిట్ట నారాయణమూర్తి, డాక్టర్ ఎం.రమేష్‌కుమార్, కె.కిరీటం, రమణ, మోహన్, సమైక్య అపార్ట్‌మెంట్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.వెంకటేశ్వరరావు, తౌడన్న పాల్గొన్నారు.

సమైక్య అపార్ట్‌మెంట్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తున్న వార్వా, నివాస్ నాయకులు

గెలిపిస్తే అందుబాటులో వుంటా : భరత్

ప్రజాశక్తి- కశింకోట : ఈ ఎన్నికల్లో ఒక్క అవకాశమిచ్చి, అనకాపల్లి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలందరికీ తాను అందుబాటులో ఉండి, అనకాపల్లిని అభివృద్ధి చేస్తానని అనకాపల్లి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ హామీనిచ్చారు. ఆదివారం కశింకోట మండలం అచ్చెర్ల గ్రామంలో ఉపాధి హామీ పథకం పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారిని మర్యాదపురం కలిశారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి పార్లమెంట్ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి ఎమ్మెల్యేగా ఫ్యాను గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు కార్యక్రమంలో జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, ఎంపిపి కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ నిమ్మదల సోమేశ్వరరావు, నిమ్మదల రమేష్‌నాయుడు, గ్రామ ఉపసర్పంచ్ దాడి శ్రీను, నిమ్మదల నాగేశ్వరరావు, నిమ్మదల రామసూరి, పొన్నాడ రాజు, గమిని నాగేశ్వరరావు, నైనంశెట్టి ప్రకాశరావు, కొలగాని ప్రకాశ్, భీమవరపు శేషు, బొడ్డేడ చిరంజీవి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వైసిపి అభ్యర్థి భరత్

అయ్యన్న కాలెజీ అధినేత డాక్టర్ ఖాశీంను సత్కరిస్తున్న దృశ్యం

అయ్యన్న కాలేజీలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- కె.కోటపాడు

15ఏళ్ల క్రితం స్థానిక అయ్యన్న జూనియర్ కాలేజీలో 2008-2010 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాలలో ఆత్మీక సమ్మేళనం నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధి, వ్యాపార రంగాల్లో స్థిరపడ్డ వీరంతా దాదాపు దశాబ్దంన్నర కాలం తర్వాత ఆదివారం ఇక్కడి అయ్యన్న డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో కలిశారు. ఈ సందర్భంగా అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టరు ఖాశీంను ఘనంగా సన్మానించారు. ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న డాక్టరు ఖాశీం మాట్లాడుతూ అయ్యన్న విద్యాసంస్థలలో ఉత్తమంగా చదివి సాఫ్ట్వేర్, పోలీస్, సచివాలయాలు, వైద్య, విద్యా తదితర శాఖలలో ఉద్యోగాలకు ఎంపికైన వారు మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశంలో అంజి, త్రినాధ్, అనురాధ, మోహనకుమారి, శాంతి, ఝాన్సీ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

దళితులకు ఒరిగిందేమీ లేదు

ప్రజాశక్తి -అనకాపల్లి

దళితవాడలను పంచాయతీ మార్చడం తప్పా వైసిపి మేనిఫెస్టోలో దళితులకు ఒరిగిందేమీ లేదని డీవీఎంపీ సభ్యులు రేబాక మధుబాబు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దళితవాడలను దళిత పంచాయతీలుగా చేయడానికి వైసిపి మేనిఫెస్టోలో చేర్చడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. సబ్ ప్లాన్ నిధులు పూర్తిస్థాయిలో దళితులకు ఖర్చు పెట్టడంపైనా, తొలగించిన 27 పథకాలు మేనిఫెస్టోలో చేర్చి ఉంటే వైసిపిపై దళితుల్లో గౌరవం పెరిగి ఉండేదని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీలు ఎదిగేందుకు ప్రభుత్వం ఏమి చేస్తున్నారన్నది మేనిఫెస్టోలో లేదన్నారు. దళితులందరూ ఇకపై ఏ పార్టీకి ఓటేయాలన్నది ఆలోచించుకోవాలని, ఓటు హక్కును నిజాయితీగా నిబద్ధతతో ఆలోచించి వెయ్యాలని పిలుపునిచ్చారు. మిగతా పార్టీలు మేనిఫెస్టోలు కూడా చూడాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -అచ్యుతాపురం

మండలంలోని తిమ్మరాజుపేట జంక్షన్లో ఆదివారం గ్రామ సర్పంచ్ పెరగడం భాగ్యలక్ష్మి బాపు నాయుడు ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. తొలి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాపునాయుడు మాట్లాడుతూ మండుటెండల కారణంగా జంక్షన్లో నుండి రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనదారులు పాదచారులకు దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బీశెట్టి రాము, కర్రి ఆదిబాబు, యల్లపు గోవింద, భవిరిశెట్టి రవికుమార్, రేవిడి కృష్ణ, శరగడం జగ్గాప్పారావు, ఎస్.నారాయణమూర్తి, మల్ల చినబాబు పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సత్కారం

ప్రజాశక్తి-సబ్బవరం

ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో 572 మార్కులు సాధించిన మండలంలోని అమృతపురం గ్రామానికి చెందిన దళిత, పేద కుటుంబానికి చెందిన గణేష్, మణి దంపతుల కుమారుడు దిలీప్ కుమార్‌ను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గొటివాడ సామ్రాట్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానం చేశారు. దిలీప్ కుమార్ తండ్రి ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ సందర్భంగా సామ్రాట్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతులు, గుర్తింపు రావాలంటే చదువు ఒక్కటే సరైన మార్గమని, కుటుంబ సమస్యలు ఎన్ని ఉన్నా తన అనుకున్న లక్ష్యం కోసం ఎంతగానో కష్ట పడుతున్న దిలీప్‌కి భవిష్యత్ లో ఏమైనా అవసరం వస్తే మేమంతా తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. విద్యార్థి దిలీప్ మాట్లాడుతూ తనను ఇంజనీర్‌గా చూడాలన్న తల్లిదండ్రుల కోరిక ఖచ్చితంగా నెరవేరుస్తానన్నారు. కార్యక్రమంలో కృపారావు, సన్యాసి పెద్దిరాజు, దేముడు బాబు, సంఘ సేవకురాలు కుమారి, రమణమ్మ, నూకరత్నం, లావణ్య, లక్ష్మి, వరలక్ష్మి, ప్రసన్నకుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రులు దాడి, కొణతాలకు

సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధి ఇప్పుడు గుర్తొచ్చిందా?

వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి

మాట్లాడుతున్న వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అనకాపల్లి

గత 40 సంవత్సరాలలో కనబడని అనకాపల్లి సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధి ఎన్నికల సమయంలోనే మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణకు గుర్తుకు వచ్చిందా అని వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి ప్రశ్నించారు. తుమ్మపాల గ్రామంలో అనకాపల్లి నియోజకవర్గ వైసిపి ప్రచార రథం, ఎన్నికల కార్యాలయం ప్రారంభోత్సవానికి ఆదివారం విచ్చేసిన వైవి సుబ్బారెడ్డి మాట్లాడారు. అనకాపల్లిలో 40 సంవత్సరాల పాటు రాజకీయం చేసి వారు ఒక్క కంపెనీ కూడా తీసుకురాలేదని, వీరిద్దరూ రానున్న రోజుల్లో ఏమి అభివృద్ధి చేస్తామని ఓట్లు అడగడానికి వస్తున్నారని ప్రశ్నించారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ మాట్లాడుతూ అనకాపల్లిలో రాజకీయం చేయాలంటే దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ కుటుంబాలనే, మరెవరూ చేయకూడదా? అని ప్రశ్నించారు. వైసిపి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ బ్యాంకులు లూటీ చేసి మోసాలు చేసిన సిఎం రమేష్‌ను అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా బిజెపి, జనసేన, టిడిపి తీసుకొచ్చాయన్నారు. ఒక సామాన్య కుటుంబంలో పుట్టి వార్డు మెంబర్‌గా గెలిచిన తనను ఉప ముఖ్యమంత్రిగా చేసిన జగన్మోహన్ రెడ్డి వ్యక్తిత్వం గ్రహించాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, ఆడారి కిషోర్ కుమార్, డాక్టర్ విష్ణుమూర్తి, పెద్దిశెట్టి గోవిందా, సర్పంచ్ తట్ట పెంటారావు, వైస్ ఎంపీపీ వెల్లూరి సూర్యకుమారి చంద్రశేఖర్, భీశెట్టి జగన్, బుద్ధిరెడ్డి దేవుడు బాబు, ఉప సర్పంచ్ చిన్న ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు 2014లో తన ఎన్నికల మేనిఫెస్టోలో రూపొందించిన 600 హామీల్లో ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు పరచలేదని, ఈ నేపథ్యంలో టిడిపి జనసేన బిజెపి ఎన్నికల మేనిఫెస్టో హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వైసిపి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్ కుమార్, జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, ఎంపీ డాక్టర్ బివి సత్యవతి, ఏపీఐడబ్ల్యూఎ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ పేర్కొన్నారు. రింగ్ రోడ్‌లోని వైసిపి కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు.

82వ వార్డులో ప్రచారం

స్థానిక 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకిరామరాజు నేతృత్వంలో ఆ వార్డులో ఆదివారం వైసిపి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ ప్రచారం చేశారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు

సుగర్ ఫ్యాక్టరీల అభివృద్ధిపై మాట్లాడాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు

మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పార్లమెంటు, జిల్లాలోని అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే తెలుగుదేశం, బిజెపి, జనసేన, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు జిల్లాలో ఉన్న సుగర్ ఫ్యాక్టరీల అభివృద్ధి, ఆధునికీకరణకు, బెల్లం మార్కెట్, ఆర్ఇసిఎసల్‌ల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకుంటారో ప్రజలకు తెలియజేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో నాలుగు సహకార సుగర్ ఫ్యాక్టరీలు, అతి తక్కువ ధరలకు విద్యుత్తును ప్రజలకు ఇచ్చే ఆర్ఇసిఎస్ సంస్థ, దేశంలోనే అతిపెద్ద బెల్లం మార్కెట్, ఎస్ఇజెడ్, బ్రాండిక్స్ లాంటి వేలాది మహిళలకు ఉపాధి కలిగించే కంపెనీలు ఉన్నాయని తెలిపారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు మూతపడిన సహకార సుగర్ ఫ్యాక్టరీలను తిప్పుతారా మూసివేస్తారా? పునరుద్ధరిస్తారా? లేదా? చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఐదు సంవత్సరాలుగా ఎస్ఇజెడ్ కంపెనీలలో జీతాలు పెరగలేదన్నారు. ఈ విషయాలు చెప్పకుండా ఎన్నికలకు వెళ్లడం సరి కాదని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నాయకులు బుద్ధ రంగారావు, కౌలు రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, కాళ్ళ తేలయ్య బాబు పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను అనకాపల్లి జిల్లాలో ఘనంగా నిర్వహించడం కోసం సిఐటియు అన్ని రంగాల యూనియన్లు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన సిఐటియు జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని మండలాల్లోనూ మేడే పతాకావిష్కరణతో పాటు కార్మిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. నేటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మిక హక్కుల్ని హరిస్తున్నాయని మండిపడ్డారు. దీనిపై మేడే సందర్భంగా మరొక్కసారి కార్మికుల హక్కులు, కార్మిక వ్యతిరేక విధానాలపై వెలుగెత్తి నినదించాలన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన 10 ఏళ్లలో కార్మిక చట్టాలను మార్పు చేయటంతో పాటు కార్మికుల పని గంటలు పెంపుదల, యాజమాన్యాలకు కొమ్ముకాసే ధోరణిలు తీసుకువచ్చిందని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారన్నారు. అందుకే ఈ మేడే సందర్భంగా కార్మిక లోకం నినదించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, వివి శ్రీనివాసరావు, రొంగలి రాము, రామకృష్ణ, ఎల్ శాంతి, శ్రీదేవి, దాకారపు శ్రీను, పిఎస్విపి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి -మునగపాక : మండలంలోని ఉమ్మలాడ, ఆనందపురం పంచాయతీ శివారు కుమారపురం గ్రామాలకు చెందిన పలువురు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. వీరికి ఎలమంచి జనసేన అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ అచ్యుతాపురం, మునగపాక పార్టీ కార్యాలయాలలో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం మాజీ జెడ్పీటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, కూటమి నాయకులు ధూళి రంగనాయకులు, మొల్లేటి ఆనంద్, కర్రి హుస్సేలు నాయుడు, పల్లి నరసింహారావు, మొల్లేటి పవన్, ఉండు బాల, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఇంటింటి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- మునగపాక : మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు ఆధ్వర్యాన వైసిపి నాయకులు శనివారం రాత్రి స్థానిక మెయిన్ రోడ్‌లో ఇంటింటి ఎన్నికల ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి యువి రమణమూర్తి రాజుని, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడుని ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి , జెడ్పీటిసి పెంటకోట సోమ సత్యనారాయణ, వైసిపి నాయకులు ఆడారి గణపతి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, మాజీ జడ్పిటిసి మల్ల సంజీవరావు, ఆడారి కాశిబాబు, కోనపల్లి రామ మోహన్‌రావు, సూరిశెట్టి కన్నారావు, టెక్కలి వీర కొండలరావు, ఆడారి వెంకట అప్పారావు, పెంటకోట శివ , దీమ్మల శివ తదితరులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ ఆధ్వర్యాన 283 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన 125వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 283 మంది కంటి రోగులను నేత్ర వైద్యులు పరీక్షించి మందులు అందించారు. బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ (బీఐఏసీ) తన ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి 300మంది హాజరు కాగా 283మందికి కంటిచూపు పరీక్షలు చేశారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో 182కి ఉచిత అద్దాలను అందించి మిగతా 92మందికి మందులు పంపిణీ చేశారు. 20మందికి కేటరాక్ట్ సర్జరీ చేయించుకోవాల్సిందిగా వైద్యులు సూచించారు. కార్యక్రమంలో వచ్చినవారికి మజ్జిక, పలహారాలు, భోజనం సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్టనర్ దొరస్వామి మాట్లాడుతూ బ్రాండిక్స్ కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బీసీలకు ప్రభుత్వం పెద్దపీట

రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- నక్కపల్లి: బీసీలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి తెలిపారు. నక్కపల్లిలోని సారిపల్లిపాలెం హైవే జంక్షన్ సమీపంలో వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి తోటలో ఆదివారం పాయకరావుపేట నియోజకవర్గం యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగించారని, ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రాష్ట్ర అభివృద్ధి ,సంక్షేమం పరంగా ముందుకు తీసుకువెళ్లడం జరిగిందన్నారు. వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, పాయకరావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, యనమల కృష్ణుడు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నానాజీ, నాయకులు చందర్రావు, తాతబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి

చేపడుతున్న పనులు

శరవేగంగా రోడ్డు పనులు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని ఎంకె.పట్నం నుండి బిబి.పట్నం, రత్నంపేట మీదుగా వడ్డిప వరకు రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గత ఆరేళ్లుగా ఈ రోడ్డు పనులు జరుగుతూ ఉన్నాయి. ఈ మూడు పంచాయతీ గ్రామాల ప్రజలు, నాయకులు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకుంటే ఈ గ్రామాల్లో తిరగలేమని వైసిపి నాయకులు చెప్పడంతో ఆదరాబాదరాగా పనులు చేపట్టారు. గొలుగొండ మండలం ఏటిగైరంపేట నుంచి ఎంకె.పట్నం వరకు బిటి రోడ్డు పనులు సాగుతున్నాయి. రెండు మూడు రోజుల్లో వడ్డిప వరకు రోడ్డు నిర్మాణం పూర్తి కావస్తుందని ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.

'గెలిపిస్తే యువతకు ఉపాధి కల్పిస్తా'

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:వైసిపి అధిష్టానం అవకాశం ఇస్తే అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన జున్నూరి జోసెఫ్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక కృష్ణా పేలస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అనకాపల్లి ఎంపీ స్థానానికి నామినేషన్ వేసినప్పటికీ కేసులకు సంబంధించిన పూర్తి వివరాలు పొందుపరచలేదని, ఒకవేళ ఆ స్థానం ఏమైనా మార్పు జరిగితే తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా రెండు సెట్లు, వైసీపీ అభ్యర్థిగా మరొక రెండు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించానన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలతో పాటు పేదరిక నిర్మూలనకు కృషి చేస్తానన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాస్

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు ఏవీ?

ప్రజాశక్తి -నక్కపల్లి:కాలేజీలకు ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించకపోతే విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఎలా వస్తాయని, సర్టిఫికెట్స్ రాకపోతే జాబ్స్ ఎలా వస్తాయని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత ప్రశ్నించారు. నక్కపల్లిలోని క్రిష్ టౌన్ షిప్‌లో ఆమె స్వగృహంలో ఆదివారం తెలుగు యువత, ఐటిడిపి, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బాబును మళ్ళీ రాప్పిద్దాం అనే కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో అనిత మాట్లాడారు. సర్టిఫికెట్స్ వస్తే జాబ్స్ అడుగుతారని భావించి విద్యార్థుల చేతుల్లో గంజాయి, డ్రగ్స్ పెడుతున్నారని విమర్శించారు. పిల్లల భవిష్యత్తు ఏంటో అర్థం కాక తల్లిదండ్రులు పడుతున్న బాధ వర్ణనాతీతం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యలు చదువుకున్న వాలంటీర్లకు కేవలం 5000 ఇవ్వడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు చించలపు పద్దు, రాష్ట్ర తెలుగు యువత జనరల్ సెక్రెటరీ గుర్రం రామకృష్ణ, ఐ టిడిపి అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షులు భీమర శెట్టి శ్రీనివాస్, అనకాపల్లి టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు పెద్దిరెడ్డి పండు పాల్గొన్నారు.

పెదబయలులో వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి- పెదబయలు:మండలంలో ఓ వ్యక్తి శనివారం అర్ధరాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. దీంతో, మన్యం వాసులు ఉలిక్కిపడ్డారు. సీతాగుంట పంచాయతీ పెదబయలు గ్రామంలో మాజీ సర్పంచ్ తైసాబు త్రినాద్ ఇంట్లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ ఇంట్లో ఉన్న వర్తనపల్లి గ్రామస్తుడు శోభ హేమరాజు (35)ని ముంచిడిపుట్టు గ్రామానికి చెందిన పల్లల సుందర్ రావు (అప్పారావు) రాత్రి పన్నెండు నుండి ఒంటిగంట మధ్యలో హత్య చేశాడు. వివరాల్లోకి వెళితే. వర్తనపల్లి గ్రామం నుంచి కుటుంబసభ్యులతో హేమరాజు పెళ్ళికి పెదబయలు వచ్చాడు. బంధువైన మాజీ సర్పంచ్ తైసాబు త్రినాద్ ఇంటికొచ్చారు. ఆ రోజు రాత్రి ఒంటి గంట సమయంలో ఇంటి మేడపై నిద్రిస్తున్న శోభా హేమరాజును నిందితుడు పల్లల అప్పారావు ముందస్తు పథకం ప్రకారం కత్తితో హత్య చేశాడు. హేమరాజు కేకలు కేకలు వేయడంతో బంధుమిత్రులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే సుందర్రావు పరారయ్యాడు. బాధితుడిని 108లో పాడేరు జిల్లా హాస్పిటల్ కు తరలించగా మృతి చెందాడని వైద్య సిబ్బంది తెలిపారు.ఆదివారం ఉదయం సిఐ రమేష్ కుమార్, ఎస్ఐ పులిమనోజ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

టిడిపి బలోపేతానికి కృషి

పలువురు నేతల వెల్లడి

ప్రజాశక్తి-గొలుగొండ:టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో మాజీ వైసీపీ గొలుగొండ మండల అధ్యక్షులు రాయపురెడ్డి నాగేశ్వరరావును కలిశారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ బలోపేతం చేయడం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో జోగంపేట మాజీ సర్పంచ్ సుర్ల సీతారామమూర్తి, సీనియర్ నాయకులు చిటికల సాంబమూర్తి, చోద్యం సర్పంచ్ అదపురెడ్డి గోపాలకృష్ణ, తెలుగు యువత అధ్యక్షుడు గెడ్డం ఆనంద్, లింగందొరపాలెం మాజీ సర్పంచ్ గెడ్డం సత్యనారాయణ, పోతల శ్రీరామ్మూర్తి, గాదె శ్రీనివాస్, రాయపరెడ్డి రాము పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

గొలుగొండ:మండలంలోని ఏఎల్ పురం పంచాయతీకి చెందిన 50 కుటుంబాలు వైసీపీ నుండి టీడీపీలో చేరాయి. అప్పికొండమ్మ వీధి నుండి గుమ్మిడి ప్రసాద్, చింతల సుబ్రహ్మణ్యంతో పాటు ఐదు కుటుంబాలు, రెల్లివీధి, బిసి కాలనీ, ఎస్సీ కాలనీ నుంచి పలువురు చేరారు. చెల్లూరి సత్యనారాయణ(మాజీ సర్పంచ్), కర్రి కృష్ణ(మాజీ ఉప సర్పంచ్)లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు వీరందరికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూర్యచంద్ర పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న అయ్యన్న

1 నుంచి వేసవి క్రీడా శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:ప్రతీ ఏడాది నింజాస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మర్ క్రీడా శిక్షణ మే 1వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు అకాడమీ డైరెక్టర్స్ వెలగా నారాయణరావు, సుతాపల్లి శ్రావణ్, సుతాపాల్లి శ్రీకాంత్, పారుపల్లి శ్రీనివాస్, సైకాలజిస్ట్ సుమ, వెలగా జగన్నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ శిక్షణలో క్రీడాకారులకు ఉచిత డైట్ బ్రేక్ ఫాస్ట్‌గా అందజేస్తునామన్నారు. కరాటే, బాక్సింగ్, వూష, థాయ్ కొండో, యోగ, కిక్ బాక్సింగ్, స్కేటింగ్, వాలీబాల్, షటిల్, వెయిట్ లిఫ్టింగ్, చేస్, కేరమ్స్, వంటి వాటిలో ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటలకు శిక్షణ ఉంటుందని, వివరాలకు ఫోన్: 9550821021, 7382329353, 9492145028, 9885352987, 9346786081 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్ ప్రచారం

ప్రచారం చేస్తున్న గణేష్

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: వైసిపి హయాంలో అభివృద్ధి, సంక్షేమం అందించామని నర్సీపట్నం సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. ఆదివారం నర్సీపట్నం మున్సిపాలిటీ 15వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.ఎమ్మెల్యే గణేష్‌కు అడుగడుగునా వార్డు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గణేష్ ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, వార్డు కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కథలు చెబుతున్న విశ్రాంత ఉపాధ్యాయులు

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో చిల్డ్రన్స్ క్లబ్‌లో భాగంగా ఆదివారం గ్రంథాలయాధికారి పి.దమయంతి ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో కథలు చదివించారు. కథలోని నీతిని వివరించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ కథలను వివరించారు.పిల్లలకు రిక్రియేషన్ గేమ్ ఆడించారు.ఎండలో తిరగవద్దని, నీళ్ల ఎక్కువగా తాగాలని సూచించారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

86 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండల కేంద్రంలోని నేతాజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఆత్మ తృప్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అంబిడి రాజయ్య ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి (విశాఖపట్నం) సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 86 మంది కంటి పరీక్షలు చేయించుకోగా ఆరుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. అవసరమైన 16మందికి కళ్ల జోళ్ళు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ తృప్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అంబిడి రాజయ్య, గౌరవ అధ్యక్షులు రామాంజనేయులు, కార్యదర్శి గంపరై మల్లేశ్వరరావు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నేతలు బజ్జంగి బాబూరావు, రాజు, త్రినాథ్, శ్రీనివాస్, వర్తక సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న వైద్యులు

ముమ్మరంగా తనిఖీలు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:-సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రం, కుజబంగి జంక్షన్‌లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఎన్నికలు కావడంతో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. మద్యం రవాణా పై ప్రత్యేక నిఘా పెట్టారు. బ్రిడ్జిలు, మలుపుల్లో తనిఖీలు చేపడుతున్నారు.

తనిఖీలు చేపడుతున్న పోలీసులు



ఆడారి ఆనంద్ కుమార్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సభ్యులు

ఆర్య వైశ్యులకు అండ : ఆడారి

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఆర్యవైశ్యులకు వైసిపి అండగా ఉంటుందని పశ్చిమ నియోజకవర్గం పార్టీ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. స్థానిక కుమారి కల్యాణమండపంలో విశాఖ జిల్లా ఆర్యవైశ్యుల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, వాసవి మాత ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం స్థలం మంజూరు చేసేలా వైవి.సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణతో ఆనంద్‌కుమార్ మాట్లాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు బెహరా భాస్కరరావు, పేడాడ రమణికుమారి పాల్గొన్నారు.

92వ వార్డులో వైసిపి ప్రచారం

జివిఎంసి 92వ వార్డు పరిధి గణేష్‌నగర్‌లో వైసిపి అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్, బెహరా భాస్కరరావు కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను వివరించారు. వైసిపి గెలిపిస్తే సంక్షేమ పథకాలు మరిన్ని అమలు అవుతాయన్నారు. ఫ్యాను గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్ కుమార్‌ను, ఎంపీ బొత్స ఝాన్సీని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూత్ కమిటీల ప్రతినిధులతో ముత్తంశెట్టి సమావేశం

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆదివారం వైసిపి మండల స్థాయి బూత్ కమిటీల ప్రతినిధులతో భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలన్నింటినీ ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సరే జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తారని వివరించారు. 2024 మేనిఫెస్టోలో ఉన్న అంశాలను గడప గడపకు వెళ్లి ప్రజలకు వివరించాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు వైసిపి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం సమీపంలోని ఆరెంజ్ కన్వెన్షన్ హాల్లో వైసిపి బూత్ ఏజెంట్లతో భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. వైసిపి గెలుపుకు బూత్ ఏజెంట్లు ప్రణాళిక ప్రకారం పనిచేయాలన్నారు. కుశలవాడ, కణమాం, ముచ్చెర్ల శిర్లపాలెం, ముకుందపురం, పంచాయతీల వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు టిడిపి జనసేన నుంచి 300 మంది వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2019 మేనిఫెస్టో చేర్చిన ప్రతి పథకాన్నీ నూటికి నూరు శాతం అమలు చేశారని తెలిపారు. 2024లో మేనిఫెస్టోకు ఆకర్షితులై వైసిపిలో చేరామని, ముత్తంశెట్టి శ్రీనివాస్ గెలుపునకు కృషిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం మండలం జడ్‌పిటిసి సభ్యులు కోరాడ వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం, శ్రీను, పాండ్రంకి శ్రీను, బోట్ట రామకృష్ణ, గన్‌రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

బూత్ కమిటీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి

54వ వార్డులో వైసిపి ప్రచారం

54వ వార్డులో ప్రచారం చేస్తున్న కెకె.రాజు తదితరులు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజిని, నాయకులు ఈశ్వరరావు ఆధ్వర్యాన సన్‌రైజ్‌క్లబ్, వాడపేట, రెడ్డికంచరపాలెం, కొత్తవాడవీధి, వివేకానంద వీధి, రవీంద్రనగర్, గణపతినగర్, సంకూర్‌పేట, సూర్యనగర్-2, ఏరియాలలో ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలు ఆయనకు అడుగడుగునా హారతులు పట్టి స్వాగతించారు. ప్రభుత్వం ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఐదేళ్లలో రూ.435 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.చిరంజీవి, అమర్‌రెడ్డి, బాకి శ్యామ్‌కుమార్‌రెడ్డి, కెపి రత్నాకర్ పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

జివిఎంసి 55వ వార్డు పరిధి అశోకనగర్, జాషువానగర్‌కు చెందిన టిడిపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు వైసిపిలో చేరారు. వారికి కెకె రాజు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో మల్లవరపు అరుణ్, అశోక్, సిద్ధు, నవీన్, మరి కొంతమంది యువకులకు ఉన్నారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైసిపి విజయానికి సైనికుల్లా పనిచేయాలని కెకె రాజు కోరారు. ఈ కార్యక్రమంలో 55వ వార్డు కార్పొరేటర్ కెవిఎన్.శశికళ, సొండి సురేష్, కాయుత పైడి రత్నాకర్, ఎడ్ల సిద్ధార్థ, ఎరంశెట్టి శ్రీను పాల్గొన్నారు.

జివిఎంసి 48వ వార్డులో వైసిపి నాయకులు బొగ్గు శ్రీను ఆధ్వర్యాన ఇందిరానగర్ -5కు చెందిన జనసేన నాయకులు తులసి, రమణ, భాషా, చిన్నా, పసుపులేటి చిన్నా, బంగారు కృష్ణ, దీనబంధు, అనీల్‌సాయి, శ్రీనివాసరావు, రమేష్, పడాల రమ తదితరులు వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజాన గంగరాజు, బొడ్డేటి అనురాధ పాల్గొన్నారు.

సిక్కు వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఆనంద్‌సింగ్ ఆహ్వానం మేరకు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఆదివారం గురుద్వారా సౌద్‌ను సందర్శించారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి కెకె.రాజును ఆశీర్వదించారు. కెకె.రాజును అక్కడ సిక్కు సోదరులకు పరిచయం చేశారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

రాష్ట్ర ఎన్నికల పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో సాధారణ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశం ఆయన మాట్లాడుతూ చిన్న పొరపాటుకు, అజాగ్రత్తకు అవకాశం ఇవ్వకుండా ఉండాలన్నారు. ఈవీఎంల భద్రత రవాణా మొదలైనవన్నీ తప్పకుండా వీడియో తీయాలని సూచించారు. బూత్ స్థాయి నుండి పోలింగ్ నిర్వహణ ఓట్ల లెక్కింపు వరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చెక్ చేసుకోవాలన్నారు. ఈవీఎంల తరలింపు నుండి తిరిగి స్ట్రాంగ్ రూముకు వచ్చేవరకు పూర్తి వీడియో తీయాలన్నారు. పాత నేరస్తులను ముందుగానే అరెస్టు చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమం (సోషల్ మీడియా), ఎలక్ట్రానిక్ మీడియా లో వచ్చే వార్తలను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటూ ఉండాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి జిల్లా నైసర్గిక స్వరూపం, రూట్ మ్యాప్, మండలాలు, నియోజకవర్గాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, జిల్లాలోని ఓటర్ల వివరాలను తెలిపారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ జిల్లాలో ఏర్పాటుచేసిన బందోబస్తు వివరాలను, సీజ్ చేసిన సారా గంజాయి మత్తు పదార్థాలు, అక్రమ సొమ్ము వివరాలను వెల్లడించారు. అనంతరం రాష్ట్ర పరిశీలకు సంబంధించిన వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీజీపీ లా అండ్ ఆర్డర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్ గున్ని, జిల్లా ఎన్నికల పరిశీలకులు దల్జిత్ సింగ్ మాంగట్, డాక్టర్ రాకేష్ కుమార్ కె, మోహన్ ఎం దహికర్, అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, డిఆర్ఓ బి దయానిధి, వివిధ ఎన్నికల కమిటీల నోడల్ అధికారులు జి వి లక్ష్మి, సత్యనారాయణ, కెవిఎల్ఎన్ కుమార్, డిఎస్‌పిలు జిఆర్ఆర్.మోహన్, డిఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు, ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, జిల్లా సిఐలు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎన్నికల పరిశీలకులు, వివిధ శాఖల అధికారులు

టిడిపి అభ్యర్థి రాజు ప్రచారం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట, వడ్డాది : చోడవరం నియోజకవర్గం టిడిపి అభ్యర్థి కెఎస్ఎన్ఎస్.రాజు ఆదివారం మండలంలోని విజయరామరాజుపేట, మంగళాపురం, ఎల్‌బిపి అగ్రహారం, బంగారమెట్ట, లోపూడి, కొండెంపూడి, పి.భీమవరం, చిన్నప్పన్నపాలెం తదితర గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా టిడిపి మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టిడిపి నాయకులు గోకవాడ కోటేశ్వరరావు, డొంకన అప్పలనాయుడు, దొడ్డి కిషోర్, సాయం శేషు, దొండ శ్రీను, తమరాన దాసు, దాడి సూర్య నాగేశ్వరరావు, ఎంపిటిసి ఎల్లపు జగ్గారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

81వ వార్డులో కూటమి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి 81వ వార్డు నెయ్యిల వీధి ప్రాంతంలో అనకాపల్లి కూటమి అభ్యర్థులు కొణతాల రామకృష్ణ, సీఎం రమేష్‌కి మద్దతుగా ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అనకాపల్లి రాము, ఎండపల్లి శేఖర్, ఎల్లపు శ్రీనివాసరావు, దాడి బుజ్జి, అనకాపల్లి మోహన్, ఆళ్ల జగదీష్, మూర్తి, నంద్యాల గణేష్, ముకుంద, బుద్ధ చంద్రవాణి, సంతోషిని పాల్గొన్నారు.

ఓటర్లను ప్రలోభ పెడుతున్న సిఎం.రమేష్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలి

సిపిఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేష్ ఇంటింటికి విసన కర్ర, కీ-చైన్ ఇస్తూ ఓటర్లను ప్రలోభాలు పెడుతున్నారని, దీనిపై ఎన్నికల కమిషన్ వెంటనే చర్యలు తీసుకొని ఆయన అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని సిపిఎం అనకాపల్లి మండలం కమిటీ కార్యదర్శి గంటా శ్రీరామ్, నాయకులు కాళ్ళ తేలయ్యబాబు, బోప్పే ఉమామహేశ్వరరావు, బుగిడి నూక అప్పారావు డిమాండ్ చేసారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకులను దోపిడీ చేసిన సీఎం రమేష్ ఆ డబ్బులు తీసుకొని వచ్చి అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గంలో ఓటర్లకు డబ్బులు, మద్యం, కానుకలు, స్వీట్ బాక్సులు, కోలాట దళాల పేరుతో చీరలను పంపిణీ చేస్తున్నారని విమర్శించారు. వివిధ కుల సంఘాలు సమావేశం ఏర్పాటు చేసి కులం, మతం పేరుతో ప్రచారం చేస్తూ ఈ ప్రాంతంలో లేని కొత్త సాంప్రదాయాన్ని తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. కుల, మత విద్వేషాలను సృష్టించి రాజకీయ లబ్ధి పొందటానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. అనకాపల్లి ప్రాంతం వాళ్ళకి ఇంగ్లీష్, హిందీ మాట్లాడటం రాదని హేళన చేస్తూ ఈ ప్రాంత ప్రజానీకాన్ని తీవ్రంగా అవమానిస్తున్న సీఎం రమేష్‌కి తగిన బుద్ధి చెప్పాలని, ఇలాంటి అభ్యర్థిని ఓడించాలని ఆయన ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్